# భారత జాగృతి మండల కన్వీనర్ల నియామకం



భారత జాగృతి మండల కన్వీనర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న అవంతికుమార్

ఆర్మూర్, అక్టోబర్15: భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్, ఆర్మూర్ కన్వీనర్ సాయినాథ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లను ఆదివారం నియమించారు. ఆర్మూర్ పట్టణ కన్వీనర్‌గా దండుగుల నాయుడు, ఆర్మూర్ మండల కన్వీనర్‌గా ముదెల్ల నవీన్, మాక్లూర్ మండల కన్వీనర్‌గా మలావత్ రమేశ్‌నాయక్, నందిపేట మండల కన్వీనర్‌గా సోఫియన్ ఖాన్, డొంకేశ్వర్ మండల కన్వీనర్‌గా పొగరి సంజీవ్, ఆర్మూర్ యూత్ కన్వీనర్‌గా ఆల్లెపు రాకేశ్ నియమితులయ్యారు. నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత జాగృతి సంస్థ బలోపేతం కోసం మండల కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మెండోరా, అక్టోబర్ 15: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి 3,580 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నదని ఏఈఈ ఎల్.మాధురి ఆదివారం తెలిపారు. కాకతీయ కాలువకు 6 వేలు, సరస్వతి కాలువకు 500, లక్ష్మి కాలువకు 200, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీటిని విడుల చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి 197.238 టీఎంసీల వరదనీరు వచ్చిందని ఏఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1090.80 అడుగులు (89.210 టీఎంసీలు) నీటి మట్టం కలిగి ఉందన్నారు.

# ఉద్యోగానికి ఎంపికైన యువకులకు సన్మానం



కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువకులను సన్మానిస్తున్న నాయకులు

భీమ్‌గల్, అక్టోబర్ 15: పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన యువకులు మామరి సాగర్, పెంబర్తి అజయ్, పడాల శివకుమార్‌గౌడ్ భీమ్‌గల్ మోచీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 8వ వార్డు కౌన్సిలర్ సతీశ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. బాపూజీనగర్ కాలనీకి చెందిన ఇద్దరు యువకులు మామరి సాగర్, పెంబర్తి అజయ్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా, పడాల శివకుమార్‌గౌడ్ జైలు వార్డెన్‌గా ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా మోచీ సంఘం అధ్యక్షుడు బోధనకర్ రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మోచి సంఘం కోశాధికారి కొండలేవు సాయిలు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎన్ను శ్రీధర్, భీమ్‌గల్ మోచీ సంఘం అధ్యక్షుడు సాయిరాం, ప్రధాన కార్యదర్శి రాచర్ల గంగాధర్, న్యూఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు రావుట్ల అరవింద్, డ్వాక్రా మహిళా సంఘాల కోఆర్డినేటర్ జలజ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైన బోధన్ విద్యార్థులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 15: దోమకొండ మండల కేంద్రం గడికోటలో ఉమ్మడి జిల్లా అర్చరీ పోటీలను ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో బోధన్‌కు చెందిన ముదసీర్, బద్రీనాథ్ విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కోచ్ పీర్యానాయక్ ఆదివారం తెలిపారు. బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న తమ అర్చరీ శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై కోచ్ పీర్యానాయక్ హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist.Nizamabad agreed to accord Loan to **Borrower: Mohammed Azeemuddin** mortgage of the schedule referred property of **Nighar Sultana.** The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.. Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

All that the existing North side Open plot of RCC Building bearing Mpl.No.1-4-318 lies in Sy No.283 & 284 of Bodhan Tarfa Douthyal admeasuring 2800 Sq.fts or 311.11 Sq.Yds or 260.11 Sq.Mtrs situated at Sharbathi Canal Road, Bodhan Town and Mandal, Nizamabad District, within the limits of Municipality, Bodhan, under the jurisdiction of Regn.Sub Dist Bodhan and Regn.Dist Nizamabad [Subject matter of the Regd.Sale Deed Doct No.2627/2008 Dt.08.03.2008, SRO Bodhan].
**Bounded by : East :** House of Anthaiah, **West:** Combined wall and House of Ajaz **South:** RCC Building of Md.Azeemuddin **North:**Neighbour's Open place

Date:14-10-2023

**Sd/- R.JAGADISHWER RAO**, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Kuragayala Ganesh S/o Narayana,** Aged 43 Yrs, Occ:Business, R/o H.No.4-7-17 & Old 4-7-618, Kasab Gally, Nizamabad mortgage of the schedule referred property of **Kuragayala Ganesh & Kuragayala Srinivas** (Co-Borrower). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

**SCHEDULE PROPERTY**

All that the Residential building bearing Old Mpl.No.4-7-618 and New Municipal No.4-7-17 (Assessment No.1046007318) admeasuring 82.68 Sq.Yds or 69.12 Sq.Mtrs situated at Kasabgally, Nizamabad, within the limits of Municipal Corporation, Nizamabad, under the Jurisdiction of Regn. Sub Dist and Regn. Dist Nizamabad (Subject matter to the Regd. Rectification Deed deed Doct No.8600/2006 Dt.10.07.2006 SRO Nizamabad)
**Bounded as below: North :** Lane and the House of Pancha Reddy **South :**House of Teli Pentaiah **East:** Road & House of Jalop Rajanna **West :**House of Jallapuram Kaloji

**Sd/- R.JAGADISHWER RAO**, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

## ముగిసిన యాదవ వధూవరుల పరిచయ వేదిక



మాట్లాడుతున్న సంఘ సభ్యులు

ముప్కాల్, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదికకు జిల్లాలోని నలు మూలల నుంచి యాదవులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. దాదాపు 40 జంటలు పాల్గొన్నాయని యాదవ సంఘం బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన యాదవ పెద్దలకు కృతజ్ఞతలు తెలపారు. కార్యక్రమంలో గోల్కొండ మహేశ్, ఎట్టెం మహేశ్ యాదవ్, గడ్డం సాయన్న, సాగర్ యాదవ్, రాజమళ్లు యాదవ్, మెరుగు సురేశ్‌యాదవ్, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist.Nizamabad agreed to accord Loan to **Kuknooru Srinivas S/o Sailoo,** Aged 43 Yrs, Occ:Business, R/o Gajulpet, Nizamabad (Borrower / Property holder) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

All that the Open Plot No.44 lies in Sy No.1678 of Nizamabad Shivar, Mandal and District Nizamabad situated in Ward No.10, Block No.14 at Varni Road (Nyalkal Road), Nizamabad, admeasuring 200.00 Sq.Yds or 167.22 Sq.Mtrs within the limits of Municipal Corporation, Nizamabad under the jurisdiction of Regn.Sub Dist Nizamabad and Regn.Dist Nizamabad [Subject matter of the Regd.Sale Deed Doct No.7170/2011, Dtd.14.03.2011 SRO Nizamabad].
**Bounded by (Within one boundary as per Regd.document)** : **North ::** 20'-0" wide road **South ::** NALA **East ::** Plot of D.Sanjeev **West ::** Plot No.43

**Sd/- R.JAGADISHWER RAO**, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist.Nizamabad agreed to accord Loan to **Gumanmal Chouhan S/o Dalaram Chouhan,** Aged 35 Yrs, Occ:Business, R/o 7-4-71, Kumargalli, Nizamabad (Borrower / Property holder) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be „Waived" and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

All that the RCC Roofed Residential Flat No.303 in the Third Floor of "Maha Laxmi Apartment" measuring 542.87 Sq.fts including share in common areas together with undivided share of land measuring 12.90 Sq.Yds or 10.78 Sq.Mtrs along with rights of Car parking area in the underground and scooter parking in the Ground Floor, constructed on the Open plot No.11 bearing Municipal No.7-1-39/6, in all measuring 400.00 Sq.Yds situated in Ward No.7, Block No.1 at Mirchi Compound (Mahboob Bagh) Nizamabad within the limits of Municipal Corporation, Nizamabad under the jurisdiction of Regn.Sub Dist Nizamabad and Regn.Dist Nizamabad [Subject matter of the Regd.Sale Deed Doct No.5631/2010, Dtd.14.07.2010 SRO Nizamabad].
**Flat Bounded as: North ::** 4"-5" Balcony **South ::** Property of Devath Papaiah **East::** Flat No.302 of C.Narendar Kumar **West** :: Open to Sky
**Building Bounded as:North ::** House of G.Chandram **South::** House of Devata Papaiah **East ::** Road **West::** Road

**Sd/- R.JAGADISHWER RAO**, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

## రోటరీ క్లబ్ ప్రతినిధుల శ్రమదానం



ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న కోటపాటి, రోటరీ ప్రతినిధులు

ఆర్మూర్, అక్టోబర్15: పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు శ్రమదానం నిర్వహించారు. ఆలయం ఎదుట పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. ఈ కార్యక్రమానికి ప్రవాస భారతీయుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఆలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపి కృష్ణ, కార్యదర్శి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు చైర్మన్ చొక్కల రాజారాం, చరణ్‌రెడ్డి, సురేశ్, గోనె శ్రీధర్, వినాయక్, రాస ఆనంద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మి శ్రీనివాస్, పోలసుధాకర్, అంబరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## 150 మందికి వైద్య పరీక్షలు

రెంజల్, అక్టోబర్ 15: మండలంలోని దూపల్లి గ్రామంలో ఆదివారం ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో 50 రకాల రోగాలకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో 150 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. లేబర్ కార్డు కల్గిన కార్మికులందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రవి, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే నసీర్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ కుటుంబాలకు చేయూత



సరుకులు అందిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి

రెంజల్, అక్టోబర్15: మండలంలోని దూపల్లి గ్రామంలో రెండు అనాథ కుటుంబాలకు బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా ఇచ్చిన హామీ మేరకు చేయూతనందించి అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా ఫౌండేషన్ తరపున రెండు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయిలు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కాశం సాయిలు, గ్రామ అధ్యక్షుడు గంగారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంజీవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజే కలాంకు ఘన నివాళి



ఏపీజె కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

నవీపేట్, అక్టోబర్ 15: మండల కేంద్రంలో ఆదివారం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే కలాం జయంతిని జనవికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి మాట్లాడుతూ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని కోరారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.